


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

# (గత సంచిక తరువాయి)

## 19

ఆరోజు సాయంత్రంతో సుబ్బారావుకి ఈ లోకంతో పూర్తి ఋణం తీరి పోయింది. కంటికీ మింటికీ ఏకధారగా ఏడుస్తున్న శారదకు అదే రాత్రి నొప్పులు మొదలయ్యాయి. బయట భయంకరమైన వాన. నరసమ్మ కూడా రాలేని పరిస్థితి. శారద నొప్పులతో మెలికలు తిరుగుతోంది. తొలి కానుపు. లేక లేక కలుగుతున్న సంతానం. ఒక శ్రీమంతం లేదు. ఏ ముద్దు మురిపాలు లేవు. పైగా అత్తమామలనే కాక భర్తని కూడా కోల్పోయిన దుఃఖంలో శారదకు వొళ్ళు తెలియట్లేదు. ఒకప్పుడు ఎన్ని కలలు కన్నదో సంతానవతి కావాలని. ఇప్పుడా  పుట్టబోయే శిశువు మీద ఆమెకు మమకారం లేదు. ఆ అభాగ్యురాలి మనసులో ఏ సముద్రాలు పొంగుతున్నాయో ఆ భగవంతుడికే తెలియాలి. అంతా సవ్యంగా ఉంటే ఎంతో ఆనందాన్నివ్వ వలసిన ఆ క్షణాలు, అప్పుడు మటుకు అందరినీ కన్నీటి కెరటాలలో ముంచెత్తుతున్నాయి. శయనమ్మ నానా తిప్పలు పడుతోంది ప్రసవం తిన్నగా జరగటానికి. శారద తల్లి, కూతురు పడే కష్టాన్ని చూడలేక తల్లడిల్లిపోతోంది. ఇంటిల్లిపాదికీ దుఃఖంతో, బాధతో, ఆందోళనతో నిద్ర లేదా రాత్రి. తెల్లవార్లూ నానా తిప్పలూ పడింది శారద. ఆమె నొప్పులకే ఏడుస్తోందో, భర్తని కోల్పోయి ఏడుస్తోందో ఆ భగవంతుడు కూడా చెప్పలేడు. తెల్లవారుఝామున కానుపయ్యింది శారదకు. పండంటి మగబిడ్డ. వాడిని కన్నెత్తి చూడలేదు శారద.

"వీడు నా కడుపున పడినప్పటి నుండి అన్నీ కష్టాలే నాకు." అన్నది విరక్తిగా.

హైమ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ పసికందును చేతుల్లోకి తీసుకుంటూ శారద కళ్ళనీళ్ళు తుడిచింది ప్రేమగా.

"వదినా, పుట్టకముందే తండ్రిని దూరం చేసి ఆ దేముడే వీడికి అన్యాయం చేశాడు. కన్నతల్లివి నువ్వు ఉండీ వీడికి మాతృప్రేమకు దూరం చేస్తావా?" అన్నది ఆర్ద్రంగా. శారద బావురుమని ఏడ్చింది.

"తప్పు తల్లీ. నీ కడుపు పండాలని ఎన్నాళ్ళ నుంచీ ఎదురు చూస్తున్నావు? పరిస్థితులు ఇలా వస్తాయని ఆ పసికందుకు ఏమి తెలుసు? వాడిని నీ జీవితానికి ఆలంబన అనుకో. నన్ను చూడు, నా అనేవాళ్ళు లేకుండా బ్రతుకు నీడుస్తున్నాను. హైమ, బాబుగార్ల పరిచయం ఏర్పడ్డాక వీళ్ళే నా వాళ్ళనిపిస్తోంది. అలాంటిది భగవంతుడు నీకు బంగారం లాంటి కొడుకు నిచ్చాడు. నీకు అండగా కొండంత ఆడపడుచు ఉంది. నీకేం తక్కువ? భగవంతుడు అన్నీ సక్రమంగా ఉంటె ఆయన్ని మరచిపోతామేమో నని ఏదో ఒకటి లోపించేలా చేస్తాడంటారు. బాధపడకమ్మా. చూడు నువ్వు పెంచాల్సిన మరుదులు నీ ఆదరణ కోసం చూస్తున్నారు."

శారద తలతిప్పి మరుదుల వంక చూసింది. వాళ్ళు భయంగా బిక్కు బిక్కు మంటూ వదిన వైపు చూస్తున్నారు. వదిన రూపం వాళ్లకి భీతి కొల్పుతోంది. వాళ్ళ మోహంలో కదులుతున్న నిస్సహాయత శారద మనసును సూటిగా తాకింది. రెండు చేతులను చాచి రమ్మన్నట్టు తల ఊపింది. తల్లి కోడి రెక్కల కిందకు చేరే కోడి పిల్లల్లా ఆమె చాపిన చేతుల్లోకి చేరారు వాళ్ళు. ఆ దృశ్యం చూస్తున్న వాళ్ళందరి కళ్ళు చెమ్మగిల్లాయి.

"వదినా ఆ పసివాడు నీ బిడ్డే. నా మరుదులే నా పిల్లలు. వీళ్ళని పెంచి ప్రయోజకులని చేయటమే నా ధ్యేయం. నీ పిల్లలతో పాటు వాడినీ నువ్వే అమ్మగా సాకు. వాడు అనాథ అనుకుని ఓ పిడికెడు ముద్ద పడేస్తూ ఉండు," చేతులెత్తి హైమకి దణ్ణం పెడుతూ అంది శారద. హైమ తప్పన్నట్లు చటుక్కున ఆమె నోరు మూసింది మృదువుగా.

పదిరోజులు గడిచాక ఆమెను తీసుకుపోవటానికి సిద్ధపడ్డారు శారద పుట్టింటివారు, శారద వెళ్ళలేదు." మా ఆయన నన్ను వదిన దగ్గరే ఉండమన్నారు," అన్నది ఒక్కటే ఆమె జవాబయ్యింది. ఆమె రాదని అర్థమయ్యాక, చేసేదేమి లేక వెనక్కి వెళ్లారు వాళ్ళు. హైమ వాళ్లకి ధైర్యం చెప్పింది శారదకు తనున్నానని.

అత్తమామలు, భర్త ఆరునెలల కాలంలో శాశ్వతంగా దూరమయ్యారు. పిల్లలు ముగ్గరికి అక్క తప్ప రక్త సంబంధీకులు లేకుండా పోయారు. హైమకు పుట్టింటి తరపున మిగిలింది వదిన ఒక్కత్తే.

భగవంతుడు కొందరి జీవితాలతో ఎందుకింత కౄరంగా ఆడుకుంటాడో ఆయనకే తెలియాలి.

భర్తను కోల్పోయిన నిర్భాగ్యురాలు శారదకు తోబుట్టువు కన్నా మిన్నగా అండగా నిలిచింది హైమ. తల్లికంటే మిన్నగా ఆదరించింది శయనమ్మ. ఆమెకు శారద వ్యక్తిత్వం ఎంతో నచ్చింది. మెట్టినింటితో బాంధవ్యాన్ని భర్త మరణంతో తుంచేసుకోకుండా, అత్తమామలు లేనప్పటికీ ఆడపడుచుతో కలిసి ఉండి, మరుదులను పెద్దచెయ్యాలన్న ఆమె నిర్ణయం శయనమ్మను ముగ్ధురాలిని చేసింది. భారతదేశపు కుటుంబ విలువలను నిలబెట్టే ఇటువంటి మహిళ లెందరో, అందరికీ హృదయపూర్వక వందనాలు.

★★★★★

కాలం ముందుకు సాగుతూనే ఉంది కర్కశంగా. పార్వతీశం, సుబ్బారావు లేని లోటు అనుభవిస్తూనే, యధాప్రకారం స్వతంత్ర పోరాటంలో పాల్గొన సాగాడు. ఆ సంవత్సరమే భారత స్వాతంత్రోద్యమంలో ఒక ముఖ్యమైన సంఘటన జరిగింది. అదే గాంధీ ఇర్విన్ ఒడంబడిక. దానిమీద సంతకం చేసాక గాంధీ శాసనోల్లంఘనాన్ని నిలుపు చేయాలని పిలుపు నిచ్చాడు. రెండవ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనటానికి గాంధీ లండన్ వెళ్ళటం కూడా జరిగింది. సర్వత్రా ఆ సమావేశ ఫలితాల కోసం ఎదురు చూపులు మొదలయ్యాయి. కానీ దాని వల్ల పెద్ద ఉపయోగం

కనిపించలేదు. బ్రిటిష్ వారు విభజించి పాలించటం మొదలు పెట్టారు. దేశంలో మళ్ళా అశాంతి మొదలయ్యింది. ఆ తరువాత జరిగిన మూడవ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ వలన కూడా ఆశించిన ఫలితం కలుగలేదు. ఈ సమావేశంలో భారతీయ జాతీయ కాంగ్రెస్ కానీ, గాంధీ కానీ పాల్గొన లేదు. భారతీయులు నిరాశలో మునిగిపోయారు.

ఎన్నో సమావేశాలు, ఆందోళనలు, హింసాత్మక సంఘటనలు, శాంతియుత ప్రదర్శనల తరువాత బ్రిటిష్ వారు భారతదేశానికి స్వాతంత్యం ఇవ్వక తప్పదనే నిర్ణయానికి వచ్చి ముందుగా భారత దేశ ప్రభుత్వ చట్టం 1935లో ప్రవేశపెట్టారు. దాని ననుసరించి ఎన్నికలు కూడా నిర్వహించారు. అందులో భారత జాతీయ కాంగ్రెస్ పాల్గొని అనేక ప్రాంతాలలో విజయం సాధించింది. అయితే ఈ చట్టం భారతీయులు ఆశించిన పరిపాలనా అధికారాలను ఇవ్వలేదన్నది జగమెరిగిన సత్యం. అందువలన పూర్తి స్వాతంత్ర్యం కోసం ఉద్యమం సాగుతూనే ఉంది.

ఇదిలా ఉండగా 1936వ సంవత్సరంలో కృష్ణ, గుంటూరు జిల్లా ప్రాంతాలలో వరుసగా వచ్చిన నాలుగు తుఫానుల ఫలితంగా అక్కడి ప్రజలు ఆర్థికంగా అపరిమితంగా దెబ్బతిన్నారు. విపరీతమైన ఆస్తి నష్టం సంభవించింది. ఆ తుఫాను సహాయార్థమై మహాత్మా గాంధీ చందాలు వసూలు చేయడానికి గుంటూరు, కృష్ణ జిల్లాలలో వీధుల వెంట తిరిగారు. ఆయన తమ కోసం చేపట్టిన ఈ చర్య ప్రజలకు కష్టాలనెదుర్కొనే మానసిక స్థైర్యాన్ని ఇచ్చింది. ఆయన సందేశం స్ఫూర్తిని నింపింది. ప్రజలు ధైర్యంగా తుఫాను నష్టాన్ని ఎదుర్కొన్నారు. ఆ సందర్భంగా వసూలు చేసిన తొమ్మిది వందల రూపాయలలో ఒక్క శయనమ్మ గారే రెండువందల వరకు వసూలు చేసి ఇచ్చారు. ఆ బృహత్కార్యంలో ఆమెకు పార్వతీశం అండదండగా నిలిస్తే, పదహారేళ్ళ సుశీల "అందరిల్లు" బాధ్యతను సొంతంగా నిర్వహిస్తూ, శయనమ్మకు అవసరమైన సమయాన్ని, విశ్రాంతిని సమకూర్చింది. విజయవాడలో జరిగిన సభలో గాంధీగారు ఆమె పేరును ప్రత్యేకంగా ప్రస్తావించటంతో ఆ చుట్టుపక్కల శయనమ్మ గారి పేరు తెలియని వారు లేకుండా పోయారు.

## 20

ఇవి దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలైతే ఇక పార్వతీశం జీవనశైలి పూర్తిగా మారి పోయింది. ఇల్లు, భార్య, పిల్లల బాధ్యతల కన్నా దేశ సేవ అతణ్ణి మరీ మరీ ఆకర్షించ సాగింది. అత్తమామలతో పాటు భర్త కూడా గతించటంతో, ఇల్లు వాకిలి తెలిసిన వాళ్ళకు బాడుగ కిచ్చుకుని, కొంత ఆస్తి అమ్మి సొమ్ము చేసుకుని, శారద గుంటూరు వచ్చేసింది. మిగిలిన పొలాలను కౌలుకి ఇచ్చేశారు. ఊరి వాళ్ళందరూ శారద వచ్చేస్తుంటే చాలా బాధపడ్డారు. అయితే ఆమెకు ఇప్పుడు అండ ఎంతో అవసరం. అందునా వెళుతోంది గుంటూరు కనుక, అదీ శాశ్వతంగా కాకపోవచ్చుననే భావంతో మిన్నకుండిపోయారు. ఆ వ్యవహారాలన్నిటిలో ఆమెకు సహాయపడ్డాడు పార్వతీశం. గుంటూరులో సొంత ఇల్లు కొనదలచింది శారద. దానికి మటుకు పార్వతీశం దంపతులు ఒప్పుకోలేదు.

"నీ కిక్కడ ఏమి లోటమ్మా? లంకంత కొంప. అందరం కలిసే ఉందాము." అన్నాడు పార్వతీశం.

"అయ్యో, నాకేం తక్కువ లేదన్నయ్యా, కానీ నలుగురు మగపిల్ల లున్నారు. ముందు రోజులు మనకు తెలియవు. ఆ పసివాళ్లకు ఇల్లు లేకుండా చెయ్యటం మంచిది కాదు. అక్కడ ఉండలేక మీ అండ కోసమని ఇక్కడకు వచ్చాము. వాళ్ళకీ అని ఒక ఇల్లు అమరిస్తే నాకు అదో తృప్తి, " అన్నది శారద. హైమ వదినగారి మాటలు విన్నాక అందులో సత్యముందని ఒప్పుకుంది.

"నిజమే కదండీ. తమ్ముళ్లకు కూడా ఒక గూడు ఉండాలి కదా!"

"అయితే ఒక పని చేద్దాం "సాలోచనగా అన్నాడు పార్వతీశం. మన శయనమ్మగారి ఇంటికి అవతల పక్క మూడు వేల గజాల స్థలం ఉంది. యజమాని బర్మా వెళ్ళిపోతూ అమ్ముతానంటున్నాడని గోపాలరావు చెప్పాడు. బేరం చేద్దాం. చెరో పదిహేనొందల గజాలు తీసుకుందాం. శారదకు కావలసినట్లు ఇల్లు కట్టిద్దాం. మన స్థలం ఏం చేద్దామో ఆలోచిద్దాములే. అమ్మాయికి పక్కనే మనమే ఉండటం మంచిది."

సంతోషంగా ఒప్పుకుంది హైమవతి.

"ముందైతే మన స్థలంలో ఒక వాటా వేయించండి. వదిన, నేను పక్క పక్కనే ఉంటాం. శయనమ్మగారు ఉండనే ఉన్నారాయె. మీరా ఇల్లు వాకిలి పట్టకుండా తిరుగుతున్నారు. మేమంతా ఒక దగ్గరుంటే ఒకరికొకరు తోడు."

"ఔను. అసలా ముసలమ్మగారికి కూడా విడిగా ఓ రెండు గదులు వేయిస్తాను మన స్థలంలోనే. ఆవిడకు మటుకు ఎవరున్నారు? మన దగ్గరే ఉంటుంది. కలిసి ఉన్నప్పుడు ఎందుకూ దండగ అనే అనిపిస్తుంది. కానీ ఎప్పుడైనా మనస్పర్థలొచ్చినా ఎవరిల్లు వాళ్ళకి ఉండటం మంచిది," అన్నాడు పార్వతీశం ముందుచూపుతో.

ఆ విధంగా ఒకే ప్రహరీ గోడ లోపల ఉన్న మూడువేల గజాల స్థలంలో మూడు పొదరిళ్ళు తయారయ్యాయి. అందరిలోకి పార్వతీశంది పెద్ద ఇల్లు. శారదకు కింద రెండు పైన రెండు వాటాలుగా కట్టించాడు ముందుచూపుతో పార్వతీశం. ముగ్గురు బావమరుదులు, శారదల పేర్లమీద వాటిని పెట్టించాడు. ఇల్లు కట్టగా మిగిలిన డబ్బులని శారద పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేయించాడు పార్వతీశం. ఆమెకు దానిమీద వడ్డీ అదనపు ఆదాయం. ఇక శయనమ్మగారికి వంద గజాలలో రెండు గదులు వేయించాడు. ఆవిడ ఎంతో సంబరపడి పోయింది. దస్తావేజులు కూడా పకడ్బందీగా వ్రాయించాడు పార్వతీశం. అతను తన ఇంటిని అమ్మ లేదు. దాన్ని శయనమ్మ గారి సంస్థ ""అందరిల్లు"" కు వ్రాసి ఇచ్చాడు

ఈ ఇంటి పనుల పర్యవేక్షణలో ఆడవాళ్లు మునిగిపోతే, పార్వతీశం దేశమనీ, ప్రజలనీ తిరగటం ఎక్కువ చేసాడు. రాను రాను అతనికి ఒక నాయకుడిగా గుర్తింపు రాసాగింది. ప్రజలందరికి కావలసినవి తెలుసుకుని చేయడంలో అతనికి ఎనలేని ఆనందం. వారిని స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేలా నడిపించడంలో ఎంతో సంతృప్తి. శారద కూడా తన దుఃఖాన్ని అణచుకుని, మోహన నవ్వు పులుముకుని నలుగురితో కలిసి ఉండటం అలవాటు చేసుకుంది. ఒంటరిగా ఉన్నప్పుడు మటుకు తన గతాన్ని తలచుకుని కంట తడి పెడుతూనే ఉంది ఇంకా. హైమ, శయనమ్మల అండలో సేద తీరటం నేర్చుకోవాలని దృఢ నిశ్చయం చేసుకున్నప్పటికీ, ఏకాంత సమయాలలో జీవితం ఆమెను భయపెడుతూనే ఉంది.

ఇంట్లో వాళ్ళకే కాదు, వూళ్ళో అందరికీ కూడా పార్వతీశం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంటూ జైలుకి వెళ్ళి రావటం అలవాటయ్యింది. చుట్టుపక్కల ఎటువంటి సభలు జరగబోతున్నా పోలీసులు ముందు వచ్చి పార్వతీశాన్ని తీసుకు వెళ్లేవారు. మొదట్లో భయపడిపోయిన హైమకు రాను రాను పార్వతీశం లేకుండా ఉండటం అలవాటయ్యింది. పైగా చుట్టు పక్కల వాళ్ళందరూ వాళ్ళ కుటుంబాన్ని ఎంతో మర్యాదగా చూసుకుంటూ, కనిపెట్టుకుని ఉండేవారు. ఆ పైన శయనమ్మ ఉండనే ఉంది

★★★★★.

కాలం ఎవరికోసం ఆగదు కదా. సుబ్బారావు పోయి ఐదేళ్ళు దాటి పొయ్యింది. అంటే చిన్నారి శేషుకి ఇప్పుడు ఐదేళ్ళు నిండాయి. అత్త, మామ, బాబాయిల ప్రేమనే తప్ప తల్లి ప్రేమను వాడు ఎక్కువగా పొందలేకపోయాడనే చెప్పాలి. మామయ్య అంటే అమిత ఇష్టం శేషుకి. ఎపుడన్నా శేషుని సహజమైన మాతృప్రేమతో దగ్గరకు తీసినా శారద చెవులలో సుబ్బారావు 'నీకు కొడుకో కూతురో పుట్టాక నా తమ్ముళ్ళని సరిగా చూసుకుంటావా?' అని అడిగిందే గుర్తొచ్చి, పొరపాటు చేసినట్లు వాడిని దూరంగా జరిపి, మరుదుల్లో ఎవరో ఒకరిని చేరదీస్తుంది. పసివాడైన శేషుకి ఇది మొదట్లో అర్థమయ్యేది కాదు. కానీ రాను, రాను తన తల్లికి తనకన్నా బాబాయిలే ఇష్టమని వాడికి తెలిసిపోయింది. దానితో కుదిరినంత వరకు తల్లికి దూర దూరంగానే మసలే వాడు. ఇక భారతికి శేషుకి వయసులో సంవత్సరం కూడా వ్యత్యాసం లేకపోవటాన అరమరికలు లేని స్నేహం వాళ్ళని కట్టి పడేసింది.

కేశవరావు గారి మిగిలిన ముగ్గురు కొడుకులు పెద్దవాళ్లవుతున్నారు. అందరిలోకి చిన్నవాడైన ప్రసాద్ ఐదవతరగతికి వస్తే వాడి అన్న రవి ఏడు, కృష్ణ తొమ్మిదవ తరగతులకు వచ్చారు. హైమ పెద్ద కొడుకు ముకుందం, కృష్ణ మధ్య ఎటువంటి అరమరికలూ లేవు. ముకుందం కృష్ణ కంటే నాలుగేళ్లు చిన్న. కృష్ణని మామయ్య అనే పిలుస్తాడు చక్కగా. కృష్ణ ముకుందా అని పలకరిస్తాడతణ్ణి.

వయసులో రెండేళ్ల తేడా ఉన్న రవి, ప్రసాద్ లు ముద్దొచ్చేలా కలిసి ఉంటారు. వాళ్ళనందరూ రామలక్ష్మణులనటం కద్దు. వాళ్లిద్దరూ కృష్ణని అన్నయ్య అని పిలుస్తారు, కానీ ఒకళ్ళనొకళ్ళు పేరు పెట్టే పిలుచుకుంటారు. అయితే చిన్నవాడైన ప్రసాదు మటుకు రవి కృష్ణల గురించి ఎవరికైనా చెప్పాల్సి వస్తే ముద్దుగా పెద్దన్నయ్య, చిన్నన్నయ్య అనే చెప్తాడు. హైమ చిన్న కొడుకు మురారికి పాపం అక్క రాజేశ్వరే నేస్తం. రాజేశ్వరి అటు భారతి, ఇటు మురారిలను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. అన్నయ్య ముకుందం అంటే భయభక్తులతో ఉంటుంది.

వీరందరి కంటే పెద్దదైన సుశీలకు చదువు తప్ప వేరే లోకం లేదు. శయనమ్మకు "అందరిల్లు"వ్యవహారాల్లో సహాయం చెయ్యటం, చదువుకోవటం మినహా ఆ వయసు పిల్లలకు ఉండే ఆలోచనలు, ఆకర్షణలు ఆమెకు లేవు. రాజేశ్వరి అంటే ఆమెకు ఇష్టం. ఇంకా చెప్పాలంటే రాజేశ్వరికి అహంకారం, అతిశయం ఎక్కువ, లోకజ్ఞానం తక్కువని, ఆవేశంతో ఇబ్బందులు పడుతుందని ఒక రకమైన జాలి. భారతి అంటే మటుకు ఎంతో ప్రేమ. అంత చిన్న వయసులో భారతి తెలివితేటలకు, పరిణితికి సుశీల ముగ్ధురాలవుతుంటుంది. భారతి జీవితంలో ఎంతో సాధించేందుకే పుట్టిందని సుశీల నమ్మకం.

శయనమ్మ సుశీల తల్లి నగలను అలాగే ఉంచింది. నగదులో కొంత వెచ్చించి కొలకలూరులో సుశీల పేర యాభై ఎకరాల మాగాణి కొన్నది పార్వతీశం సలహాతో. దాని మీద వచ్చే డబ్బుని సుశీల పేరే దాచి ఉంచుతోంది. మిగిలిన డబ్బుని కూడా ఆమె పెళ్ళి కోసమని జాగ్రత్త పరచింది. సుశీలకు ఇప్పుడు తల్లిదండ్రులు గుర్తు కూడా లేరు. శయనమ్మే అమ్మ. శయనమ్మ ఆనాడు తెచ్చిన సంచీని అందులో ఫోటోతో సహా అలాగే అటక ఎక్కించింది.

శయనమ్మ సుశీల దగ్గర ఎన్నిసార్లు పెళ్ళి ప్రసక్తి తెచ్చినా, "అమ్మా, నన్ను చదివించు. ఇప్పుడప్పుడే పెళ్ళి వద్దు, " అని సుశీల ఖచ్చితంగా చెప్పేస్తోంది.

## 21

కొత్త ఇంట్లోకి మారే వేళ్టికి చిన్నారి భారతికి ఐదు సంవత్సరాలు. తల్లి, అత్తల గారాబంతో పెరుగుతోంది. శయనమ్మకు భారతి నెత్తి మీది దేవత. ఇంట్లో స్వతంత్ర పోరాటం గురించి అన్ని చర్చలు జరుగుతున్నా ఏదీ అర్థం చేసుకోలేని వయసు. కానీ తమ ఇంటిలోని వారే కాక చుట్టుపక్కల వారందరూ "స్వాతంత్ర్యం" కోసం తపించిపోతున్నారని భారతికి తెలుసు. ఆ చిన్నారి మంత్రంలా 'వందేమాతరం' అని ఎన్నిసార్లు పలుకుతుందో! బ్రిటిష్ వారు నిషేధించిన వందేమాతరం పాట భారతికి పూర్తిగా నేర్పింది శయనమ్మ. పార్వతీశం పనిమీద బయటకు వెళ్లేప్పుడల్లా 'జైభారత్' అనటం నేర్పాడు చిన్నారి భారతికి. దాని అర్థం పూర్తిగా తెలియక పోయినా ఎవరు ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నా చిరునవ్వుతో చిలక లాగా 'జై భారత్' అనేది భారతి. శయనమ్మ తనకు సమయం కుదిరినప్పుడల్లా సాయంకాల

సమయాల్లో కేవలం పురాణాలే కాక దేశభక్తి నూరి పోసేది భారతికి. భారత దేశంలో పుట్టినందుకు, ఈ మహత్తర దేశ ఋణాన్ని ఎలా తీర్చుకోవాలో ఉద్బోధిస్తుండేది. వారూ, వీరు నీకేమిచ్చారని చూడకుండా, నువ్వు దేశానికి ఏమివ్వగలవో ఆలోచించుకోమని ఉపదేశాలిస్తుండేది. భారతి ఆమెకు ప్రియ శిష్యురాలయ్యింది. ఆమె సేవాగుణ వారసత్వాన్ని పుడికి పుచ్చు కుంటోంది.

భారతికి మూడేళ్ళు నిండే వేళ్టికే రాజేశ్వరి బడికి వెళ్తుండేది. అక్కడ నేర్పిన పాటలు, పద్యాలూ, అక్షరాలూ, పదాలు ఇంటి దగ్గర వల్లె వేస్తుండేది. అవి వినీవినీ భారతికి నోటికి వచ్చేసేవి.

"అల్పుడెప్పుడు పల్కు నాడంబరముగాను," అని రాజేశ్వరి వల్లెవేస్తుంటే పక్కనుంచి భారతి

"సజ్జనుండు పల్కు చల్లగాను"అనేది

"రెండు రెండ్లు నాలుగు "అని రాజేశ్వరి లెక్కలు వల్లె వేస్తుంటే భారతి "రెండు మూళ్లు ఆరు "అనేది.

"భారత దేశానికి ఉత్తరమున హిమాలయములు " అని రాజేశ్వరి మొదలు పెట్టగానే "దక్షిణమున హిందూ మహా సముద్రము "అని అందించేది భారతి.

"మన భారతి మహా చురుగ్గా ఉన్నదే. బడిలో వేస్తే చక్కగా చదువుకుంటుంది" అనేవాడు పార్వతీశం. వాళ్లకి అంత అవకాశం ఇవ్వలేదు భారతి. ఒకరోజున రాజేశ్వరి బడికి వెళ్తుంటే, నేనూ వస్తానని ఏడుస్తూ వెంటపడింది. ఎంత చెప్పినా చెల్లాయి వినకపోయేసరికి వంట ఇంట్లో ఉన్న తల్లికి వినపడేలా ఓ కేక పెట్టింది రాజేశ్వరి.

"అమ్మా, నేను, చెల్లాయి బడికెళ్లొస్తాం."

తల్లి విని బయట కొచ్చేలోగా ఇద్దరూ చేతులు కలుపుకుని బడికేసి వెళ్లారు. అక్కడ రాజేశ్వరి తరగతి గది గోల గోలగా ఉంది. పిల్లలందరూ ఎవరి లోకంలో వాళ్ళు ఉండి కబుర్లు చెప్పుకుంటున్నారు. పంతులుగారు వచ్చేదాకా గొడవ చెయ్యటం, ఆయన రాగానే కుయ్ అనకుండా కూర్చోవటం విద్యార్థులకు అలవాటే కదా. విశాలమైన ఆవరణలో ఉన్న ఆ బడి లో రెల్లు కప్పుతో ఉన్న తరగతి గదులు వరుసగా ఉన్నాయి. కొన్ని తరగతులు అక్కడక్కడా ఉన్న చెట్ల కిందే ఉన్నాయి. తెలుగు పంతులు గారు వేప చెట్టు కింద చెప్తున్న నీతి శతకాల పద్యాలూ గట్టిగా వినిపిస్తున్నాయి. అది ఒకటో తరగతి. భారతికి ఆ పద్యాలు తెలుసు. అక్కతో ఆడుతున్నది కాస్తా ఒక్కసారి ఆ చెట్టు కిందకి పరిగెత్తింది.

నారాయణ పంతులుగారు అసలే ముక్కోపి. క్రమశిక్షణకు ప్రాణం పెడతాడాయన. భారతి పరిగెత్తుకుంటూ చెట్టు కిందికి వచ్చి కూర్చోవడం ఆయన ఓరకంట గమనించాడు. ముద్దు పడ్డాడు కూడా. అయితే చిన్నారి భారతికి బడి నియమాలు తెలియవాయే! తన పక్కనే కూర్చున్న అరుణ భారతికి తెలుసు. వెంటనే పలకరిస్తూ

"అరుణా, పప్పుండలు తింటావా?" అంది గౌను జేబులోంచి ఒకటి తీస్తూ. అరుణ చెయ్యి చాపింది. వెంటనే భారతి

"అమ్మా, ఆశ దోశ అప్పడం వడ నీ జాంకాయ ముక్క పెట్టేలా అయితేనే "అంది. బేరం కుదరడంతో అరుణ తన సంచి లోంచి జామకాయ బయటకు తీసి కాకెంగిలి చేసి భారతికి పెట్టటానికి సిద్ధమైంది. ఈ లోగా ఇటు పక్కనున్న బాబీగాడు తన జేబులో ఉన్న జీళ్ళు చూపించాడు. భారతికి నోరూరింది.

"ఒరేయ్ బాబిగా, నీకూ పప్పుండ యిస్తాను కానీ నాకు నువ్వు జీడీ ఇస్తావా?" గట్టిగా అడిగింది. ఇవన్నీ చూస్తున్న నారాయణ మాస్టారుకి కోపం వచ్చింది.

"ఒరేయ్ బాబీ, ఇటు రారా," అంటూ వాడిని పిలిచి చేతిలో ఉన్న వేప బెత్తంతో ఒక్కటి వేశారు. అదే ఊపులో

"ఇది తరగతి అనుకుంటున్నారా? ఆట స్థలమా? ఏంటీ గొడవ? ఒసే కొత్త పిల్లా ఇటు రావే," అన్నారు ఉగ్రంగా. భారతి ఆయన తననే పిలుస్తున్నా డని గ్రహించి భయపడి రానన్నట్లు తల అడ్డంగా తిప్పింది. దాంతో పంతులు గారికి శివాలెక్కింది.

"రావా" అంటూ తనే కోపంగా భారతి వైపు ఒక్క ఉదుటున ఉరికాడు. దాంతో భారతి బెదిరి పోయింది. ఒక్క పరుగు తీసింది. భారతి, వెనకాలే పిలక ఎగురుతుండగా నారాయణపంతులు. దొరకబుచ్చుకుని భారతికి గట్టిగా బుద్ధి చెప్పాలని ఆయన, దొరికితే బెత్తం పలకరిస్తుందనే భయంతో భారతి చెట్టు చుట్టూ పరిగెత్తడం మొదలు పెట్టారు. ఆ దృశ్యం బాగా నవ్వు పుట్టించేదిగా ఉండటంతో విద్యార్థులందరూ గట్టిగా నవ్వటం ప్రారంభించారు. అది పంతులు గారిలో ఉక్రోషం పుట్టించింది..భారతేమో లేడిపిల్లలాగా పరుగులు తీస్తూ దొరకాదాయే! చిట్టచివరకు ఎలాగోలా నారాయణ పంతులు భారతిని దొరకబుచ్చుకుని బెత్తంతో గట్టిగా వీపు మీద ఒక్కటి ఇచ్చుకున్నారు. అంతే, భారతి కెవ్వున అరిచి,మూడు ఊళ్ళకు వినిపించేంత గట్టిగా ఏడవటం మొదలు పెట్టింది. పుట్టి బుద్ధెరిగాక ఆ పిల్ల వొంటి మీద పడ్డ మొదటి దెబ్బ అది! ఆ ఏడుపుకి, అప్పుడే చెల్లెలు తన దగ్గర లేదని గమనించి వెతుక్కుంటున్న రాజేశ్వరి ఒక్క పరుగున అక్కడికి వచ్చింది. అప్పటికి భారతి అక్కడ నేలమీద కూలపడి గట్టిగా ఏడుస్తోంది.

"పంతులుగారు, కొట్టద్దు. ఇంకెప్పుడు బడికి రానూ, "అంటోంది గట్టిగా వెక్కుతూ భయపడిపోతూ.

"పంతులుగారూ, ఇది మా చెల్లాయి. మన బడిలో చేరలేదసలు," అంది రాజేశ్వరి. ఆ మాట వినగానే నారాయణ పంతులు గారికి ముచ్చెమటలు పోశాయి." ఏమిటీ, పార్వతీశం గారి అమ్మాయా? మరి ఎందుకు వచ్చిందమ్మా బడికి? ఇక్కడే కూర్చుందే, పద్యాలు కూడా చెప్తోంది," అన్నారు అయోమయంగా.

"దానికివన్నీ వచ్చుండీ. నేనే నేర్పాను. నాదగ్గర కాసేపు కూచుని విసుగుపుట్టి మీ దగ్గర తెలిసిన పద్యాలు వినపడి వచ్చినట్లుంది.నేను దీన్ని ఇంట్లో దింపి వస్తానండీ" అడిగింది రాజేశ్వరి.

"వెళ్ళిరామ్మా. జాగ్రత్త."అన్నారు నారాయణ పంతులు గారు ఏడుపు మొహంతో నవ్వుతూ. భారతి పార్వతీశం గారి అమ్మాయని తెలిసినపుడే ఆయన పై ప్రాణాలు పైనే పోయాయి. ఆ బడి లో తమకు జీతాలు సరిగా వస్తున్నాయంటే ఆయన దయే కదా! రాజేశ్వరితో పాటు ఇంటికి బయల్దేరిన చిన్నారి భారతి ఆయన వైపు చూస్తూ

"ఇంకనేనసలు బడికే రాను పో" అంది శపథం చేస్తున్నట్లు. ఈలోగా ఇంట్లో భారతి కనపడక వెతుక్కుంటున్న శయనమ్మగారికి హైమవతి చెప్పింది రాజు ఇందాక భారతిని బడికి తీసుకు వెళ్తున్నానని చెప్పిందని. ఆవిడ అదిరే గుండెలతో బడికి పరిగెత్తుకు వచ్చేసరికి అప్పుడే రాజేశ్వరి. భారతిని ఇంటికి తీసుకొని రాబోతోంది. జరిగినదంతా రాజేశ్వరి నోటంట విన్న శయనమ్మగారి కోపానికి అవధులు లేకపోయాయి.

"అయితే పంతులూ, నీకు నీ బడిలో పిల్లలెవరో, కాని దెవరో తెలియదేంటయ్యా? ఇంకేం పంతులువి? మా బాబుగారితో చెప్పి నీ ఉద్యోగం రేపీ పాటికి ఊడగొట్టించేస్తాను."

"అమ్మా శయనమ్మతల్లీ, అంత పని చెయ్యకమ్మా. పెళ్ళాం పిల్లలున్నవాడిని. ఈ అమ్మాయి మీ ఇంటి పిల్లని నాకు తెలియదు," గడగడా వణికి పోయారు నారాయణ గారు.

"అదేం మాట? అంటే వేరే ఇంటి పిల్లైతే ఇలా కొట్టవచ్చా?" తట్టు తేలిపోయిన భారతి వీపు చూపిస్తూ అన్నదామె ఉగ్రంగా." పిల్లలనిలా కొట్టి చంపుతారాండీ? మీ సంగతేదో పెద్ద పంతులుగారి దగ్గరే తేలుస్తా." భారతిని చంకన వేసుకుని పెద్ద పంతులు గారి గది వైపు బయలుదేరింది శయనమ్మ.

"తల్లీ, శాంతించండి. అయినా గొడ్డు అమావాస్య నాడు పిల్లని బడికి పంపుతారాండీ ఎవరైనా? అందుకే ఇలా జరిగింది. వచ్చే దసరాల్లో నేనే ఇంటికొచ్చి అక్షరాభ్యాసం చేయిస్తానుగా" ఆవిడని శాంతింపచేసే సరికి ఆయన తలప్రాణం తోక్కొచ్చింది.

ఆ రాత్రి అంకపొంకాలుగా జ్వరం వచ్చేసింది భారతికి. నారాయణ పంతులు వేప బెత్తం తీసుకుని తన వెంట పరిగెడుతున్నట్టు కల రావటంతో.

"పంతులుగారూ, కొట్టొద్దండి, ఇంకెప్పుడూ మీ బడికి రానండీ" అని కలవరింతలు మొదలుపెట్టింది. ఇంటిల్లిపాదీ భయపడ్డారు. పార్వతీశం భారతిని ఎత్తుకుని తిప్పుతూ

"భయం లేదమ్మా. నువ్వసలు బడికి వెళ్లొద్దు. పంతులుగారిని నేను కోప్పడతాను కదా, " అంటూ ఓదార్చాడు. శయనమ్మ ఏడుకొండలవాడికి ముడుపు కట్టింది. భారతికి ఎర్ర నీళ్ళు దిష్టి తీసి పోసింది. తెల్లవారేసరికి భారతి జ్వరం తగ్గుముఖం పట్టింది కానీ, బడి అంటే భయం మటుకు మనసులో నిలిచిపోయింది. తరువాతి దసరాలలో అక్షరాభ్యాసం కూడా నారాయణ పంతులుగారి చేతి మీదుగా జరగటానికి ఒప్పుకోలేదు భారతి. చివరికి శయనమ్మగారే భారతి చేత ఓనమాలు దిద్దించి, చుట్టు పక్కల పిల్లలందరికీ పప్పు బెల్లాలు పంచారు భారతి చేతుల మీదుగా. ఆ తరువాత భారతి బడి మొహం చూసిందే లేదు. నారాయణ పంతులికి మాత్రం ఒక పంచెలచాపు పంపించింది శయనమ్మ. భారతి చదువు ఇక అందరింట్లోనే. అలాగని అక్షర జ్ఞానం తెలియని పిల్లగా పెరగలేదు. అక్క పుస్తకాలన్నీ తానూ చదివేది. అన్నయ్యలు ఆంగ్లంలో మాట్లాడితే అర్ధం చేసుకునేది, శయనమ్మగారి దగ్గర రామాయణ భారతాలు నేర్చుకుంది. తండ్రి దగ్గర లెక్కలలో రాటు తేలింది. ఈ విధంగా బడి కైతే వెళ్ళలేదు కానీ భారతికి చదువు తోటి పిల్లలకంటే ఎక్కువగానే అబ్బింది. దానితో పాటే తండ్రి రాజకీయాల కోసం ఇంటికి వచ్చిపోయే వివిధ ప్రాంత వాసుల వలన ప్రపంచజ్ఞానం కూడా అబ్బింది. ఎవరితో ఎలా మెలగాలో, ఎలా మాట్లాడాలో తల్లి శిక్షణ వల్ల నేర్చుకుంది. చదువుకునేందుకు బడికి వెళ్లకపోవడంతో తల్లి వెనకాల, అత్త వెనకాల, శయనమ్మగారి వెనకాల తిరుగుతూ తిరుగుతూ వారి పని పాటలను, పద్ధతులను కూడా బాగా అవగాహన చేసుకుంది, వస్తుతః తెలివైన భారతి, అంతే కాదు, సుశీల చదివే పాఠ్యేతర పుస్తకాలను తనూ చదవాలని ప్రయత్నిస్తుంది. అందులో వచ్చే అనుమానాలను తీర్చమని అందరినీ వేధిస్తుంటుంది.

"ఇదో పుస్తకాల పురుగు. బడికి మటుకు వెళ్ళదు కానీ" అని అందరూ విసుక్కుంటుంటారు.

ఇక రాజేశ్వరిది మరో తీరు. చదువులో ఆట్టే చురుకుదనం లేకపోయినా, బాగా కష్టపడేది. బడి కెళ్ళి వచ్చి, బడి వాళ్ళిచ్చిన ఇంటిపని చేయటంలో సమయంగడిపేది. ప్రత్యేకంగా చదవకుండా ఆటలకు పరిగెత్తేది. ఎప్పుడన్నా తల్లి పనిలో సాయం రావట్లేదని అరవబోయినా, శయనమ్మగారో లేకపోతే శారదో వెనకేసుకు వచ్చేవారు. శారదకైతే కోడళ్ళు ఇద్దరూ ప్రాణం. అందునా పెద్ద కోడలంటే మరీ ఇష్టం.

"ఏమిటి వదినా నువ్వు మరీనూ, దాని కిప్పుడేమంత వయసైపోయిందనీ? అదే నేర్చుకుంటుందిలే" అనేది.

"నీకేం వదినా, చెప్తావు. రేపు అమ్మ పెంచిన బిడ్డా? అయ్య పెంచిన బిడ్డా అంటారు. ఆ మాట నేను పడాలి. దాని కప్పుడే తొమ్మిది. ఇవాళ కాకపోతే రేపైనా అత్తారింటికి వెళ్ళొద్దు?" అనేది హైమవతి.

"అప్పుడు నేను చెప్తాలే వదినా జవాబు. మరేం ఫరవాలేదు, " అనేది శారద నవ్వుతూ. ఈ రకమైన సంభాషణలు ఆ వదినా మరదళ్ల మధ్య సర్వ సామాన్యమే.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS